# దెయ్యాల గరువు

మా వూరు-పంచాయితీకి పెద్దది, మునిసిపాలిటీకి చిన్నది. అయినా మునిసిపాలిటీ అయిపోయింది—రెండు కారణాలవల్ల.

మారంగ ప్రసాదరావుగారి బావమరిది కొడుక్కి- ఓ మంత్రిగారి కోడల్ని ఇచ్చి తిరపతిలో పెండ్లి చేసిన సందర్భంలో, అంతక్రితం రెండు

నెల్లుగా జనసంఘం మెంబరుగా ఉంటూ వచ్చిన రంగప్రసాదరావుగారు, అంతరాత్మ ప్రబోధానికి లోబడి కొత్త కాంగ్రెసు మతం పుచ్చుకున్నాడు. అదొక కారణం.

పదేళ్ళుగా మూతబడి ఉన్న 'మధుర పంచదార' ఫాక్టరీ సేట్ శాంతారామ్ కేవల్‌రామ్ ధర్మమా అని తిరిగి పని చెయ్యడం ప్రారంభించడమే కాకండా, ఈ ఏడాదిలో మూడు రెట్లు పెరిగింది. ఇది రెండో కారణం.

మా వూరు పాత కొత్తల మేలుకలయిక. రైలు మా వూరుకి నాలుగు మైళ్ళ దూరాన్నించి పోతుంది. అయితే పంచదార ఫాక్టరీ మూలంగా మా వూరి పేరున ఒక రైల్వే స్టేషను వెలిసింది. అక్కడినించి ఫాక్టరీ దాకా కంకరరోడ్డు పడింది. అందులోంచి రంగప్రసాదరావుగారింటి దాకా ఆ రోడ్డు పెరిగింది. ఆ తరవాత తారు కూడా వేశారు రోడ్డుకి. ఎందుకంటే ఆయన ఈ మధ్యనే కారు కొన్నారు. మనిసిపాలిటీ అయాక రాజవీధి, మరికొన్ని కౌన్సిలర్‌లున్న సందులూ తారు రోడ్లయాయి. తక్కిన వీధులు, సందులు అన్నీ మట్టి రోడ్లు.

సరే, మా వూరికి ఎలెక్ట్రిసిటీ వచ్చింది. అందువల్ల రేడియోలొచ్చాయి. రోడ్డు పడ్డ మూలంగా బస్సు వచ్చింది. పైనుంచి ప్రతి రోజూ పన్నెండు గంటలవేళ ఒక విమానం పోతుంటుంది-మా వూరి మీదినించి. గుడి ఆవరణలో కూర్చుని పూజారి చలమయ్యా, కరణం గవరయ్య ఆ విమానం గమ్య స్థానాన్ని గురించి రోజూ తగాదా పడుతుంటారు - విశాఖపట్నం పోతుందని ఒకరు, హైదరాబాదు పోతుందని ఒకరు. అయితే అసలు విమానం జన్మస్థానాన్ని గురించి ఇద్దరికీ ఏకాభిప్రాయం. వేదకాలంలో మనవాళ్ళు కనిపెట్టారు విమానం. తెల్లవాడు ఈ మధ్య కాలంలో, ఎప్పుడో

అది కొట్టేసి, సొంతం చేసుకున్నాడు. తయారు చేసి మన కమ్ముతున్నాడు.

సరే, మా వూళ్లో ఎలెక్ట్రిక్ దీపం ఉంది, కిరసనాయిలు దీపం ఉంది. పాడుపడ్డ వేణుగోపాలస్వామి ఆలయముంది, పంచదార ఫాక్టరీ ఉంది. సేట్ గారి పడవలాంటి పెద్ద కారుంది, రెండెడ్ల బండుంది. తారు రోడ్డుంది, మట్టి రోడ్డుంది. రంగప్రసాదరావుగారి కొత్త బంగళా ఉంది, వెంకన్న చౌదరిగారి మండువా లోగిలుంది. పాతవి అట్టే పోకండా, కొత్తవి ఎన్నో ఒచ్చాయి మా వూరికి.

ఎప్పుడో పోవలసింది, పోయినట్టు కనిపించేది — అయినా ఎప్పటి కప్పుడు ప్రాణం పోసుకుంటున్నది- మా వూళ్ళో దెయ్యాల గరువు.

అది ఒకప్పుడు, పీరారం రాజావారిది. పెద్ద రాజభవనం వుండేదట అక్కడ. ఇప్పుడు దాని శిధిలాలైనా లేవు. అయిదెకరాల ఆవరణలో ఒక మూలగా చవుడు పట్టిన నాలుగు ఇటిక గోడలు మట్టుకు ఉన్నాయి. పైన ఒకప్పుడు కప్పు ఉండేదనడానికి కొన్ని ఆధారాలున్నాయి. అయితే ఆ గోడలు జమీందార్ల రోజుల నాటివి అనడానికి ఆధారాలు మాత్రం లేవు. వాటిమీద సగం వరకు తాటాకులు కప్పి, రుద్రయ్య, మునిగాడు కాపరం చేస్తున్నారు.

రుద్రయ్యకీ, మునిగాడికీ చుట్టరికం ఏమీలేదు. ఒక కులం వాళ్ళేమో అనడానికైనా, వాళ్ళ కులా లేవిటో ఎవరికీ తెలియదు, వాళ్ళకే తెలియదు. చిల్లర దొంగతనాలు చేసి, ఆరేసి నెల్లు జైలు శిక్ష అనుభవించి వస్తుంటా రిద్దరూ. మళ్ళీ దొంగతనం చేసి పట్టుబడే దాకా దెయ్యాల గరువు మీది 'ఇంట్లో' వాళ్ళ ఆవాసం.

అసలు దెయ్యాల గరువుకి ఆ పేరెల్లా వచ్చిందో సరిగ్గా ఎవరికీ

తెలియదు. గరువు మీద దెయ్యాలున్నా యనడానికి మాత్రం నిదర్శనాలు ఉన్నాయి.

మూడేళ్ళ క్రితం రుద్రయ్య, మునిగాడు చౌదరిగారి గదిలోంచి నాలుగు బస్తాల ధాన్యం కొట్టేసి అమ్మేసిననాడు రాత్రి, విందు చేసుకున్నారు. వేపుడు మాంసాన్ని, కాపు సారానీ, రంగసాన్నీ తెచ్చుకున్నారు. రంగసాని విషయంలో కాని, మరే విషయంలో కాని ఇద్దరి మధ్యా తగాదాలు రావు. ఒక్క విషయంలో మాత్రం ఇద్దరికీ మహచెడ్డ పట్టింపు. నాలుగు గోడల మధ్య 'ఇంటి'నీ—అందులో తాటాకు కప్పిన భాగాన్నీ—ఇద్దరూ చెరిసగం పంచుకున్నారు. రాత్రి నిద్రపోయేటప్పుడు ఎవరి భాగంలో వాళ్ళు పడుకోవలసిందే. నిద్రలో ఏ ఒక్కరూ మధ్య గీసిన గిరి దాటి రెండో భాగంలోకి దొర్లినా రెండో వాడు, కాళ్ళు విరగ్గొడతాడు. దొంగిలించిన సొమ్ము విషయంలో కూడా పెద్ద పట్టింపులు లేవు. ఎవడి కెక్కువ తాగాలనుంటే వాడెక్కువ తాగుతాడు. ఎవడి కెక్కువ తినాలనుంటే వాడెక్కువ తింటాడు. కాని 'ఇంటి' వాటా విషయంలో మాత్రం ఎవరిది వారిదే. ఆ రాత్రి ఏం జరిగిందంటే—అంటే చౌదరిగారి ధాన్యం నాలుగుబస్తా లమ్మేసి రంగసానిని తెచ్చుకున్న రాత్రి—రుద్రయ్య సారా సీసాకి దబ్బిస్తుండగా, మునిగాడు నాలుగు ముంతలు కల్లు కొట్టేశాడు. మునిగాడు దబ్బిస్తుండగా రుద్రయ్య మరో మూడు ముంతలు దాటించేశాడు. అవన్నీ తెచ్చి ఉత్సాహంగా రంగసానిచేత తాగించడంచేత అది స్పృహతప్పి పడిపోయింది. పడిపోడం 'ఇంటి' మధ్య గీసిన గిరిమీద పడిపోయింది. అప్పటికి ఇద్దరూ ముంతలు కాళీచేసి సీసాలు ఆశ్రయించడంచేత, రంగసాని ఎవరి వాటాలో పడిపోయిందో స్పష్టంగా తేలలేదు. మొదట అతి సఖ్యంగా, అహింసా పద్ధతిని, రంగసానిని కొలవడం మొదలెట్టారు - గీత ఇవతల ఎంతుందో అవతల ఎంతుందో తేల్చుకోడానికి. ఆ తరవాత ఏం జరిగిందో స్పష్టంగా ఇద్దరికీ

గుర్తులేదు. తెల్లవారేసరికి. ఇద్దరి శరీరాలమీద రక్తం, గాయాలు. రంగసానికి పిచ్చెక్కింది. వెర్రిగా అరుచుకుంటూ వీధుల వెంట పరిగెత్తింది. దాని పిచ్చి ధోరణివల్ల అందరికీ అర్థమైనదేమిటంటే, ఆ రాత్రి ఆ 'ఇంట్లో' ఇద్దరు బ్రహ్మరాక్షసులు ఒకరి నొకరు విరుచుకుతిన్నారట.

ఇంకో రాత్రి ఏం జరిగిందంటే, యెంకప్ప మందలో గొర్రె ఒకటి తప్పించుకుని, దెయ్యాల గరువుమీదికి పోయింది. తెల్లారేసరికి దాని చర్మం, ఎముకలు మిగిలాయి. ఏటివారగా దెయ్యాల గరువుమీద ఓ గొయ్యుంది. ఆ గోతిలో కాలిన కట్టెలూ, చితుకులూ, బాగా నమిలి పారేసిన ఎముకలూ ఉన్నాయి. రుద్రయ్య, మునిగాడు ఆ క్రితం రోజే కరణంగారి కోడలి బంగారపు గాజులు కొట్టేసిన నేరానికి జైలుకి పోయారు. అంచేత గొర్రెని చంపి కాల్చి తిన్నది దెయ్యాలుగాక మరెవరు?

ఇలాంటివే ఎన్నో తార్కాణాలున్నాయి.

అయితే పగలంటే దెయ్యానికి భయం గనక, ఊళ్ళో పిల్లలంతా గరువుమీద ఆడుకుంటూ ఉంటారు.

పంచదార ఫాక్టరీ, దానితోపాటు కొంత నాగరికత మా వూళ్ళో ప్రవేశించాక, దెయ్యాలమీద తాత్పర్యం కొంత తగ్గింది. దానికితోడు, ఫాక్టరీలో కెమిస్ట్, రాయ్ అనే బెంగాలీ అతను దెయ్యాలే లేవన్నాడు. ఊరి వారితో పందెంవేసి, ఓ రాత్రి అతను చాప, పరుపుచుట్ట తెచ్చుకుని దెయ్యాల గరువుమీద పడుకున్నాడు. పొద్దున్నే నిక్షేపంలా లేచి ఫాక్టరీకి వెళ్ళిపోయాడు. దాంతో దెయ్యాల గరువుమీద దెయ్యాల విషయమై రెండు భిన్నాభిప్రాయాలు బయలుదేరాయి. ఊళ్ళో దెయ్యాలున్నాయని ఊరంతా ఒప్పుకున్న విషయమే. అయితే దెయ్యాల గరువుమీద మాత్రం అవి ఉన్నాయా లేవా అన్నది మీమాంసలో పడింది. ఉన్నాయనే వారి వాదం

ఏమంటే, దెయ్యాలు చెడ్డవి గనక, చెడ్డ వాళ్ళనేం చెయ్యవు. రుద్రయ్య మునిగాడు చెడ్డవాళ్ళు. అందుకే వాళ్ళు అక్కడ ఉండ గలుగుతున్నారు. ఫాక్టరీ కెమిస్టు రాయ్ బాబు కూడా చెడ్డవాడే అయుంటాలి. అంచేత అతన్ని దెయ్యాలేం చెయ్యలేదు. ఇంక రెండో పక్షం వాదం - ఆ రోజు రాత్రి రుద్రయ్యనీ, మునిగాణ్ణీ కూడా దెయ్యాలు పీకి పాదిలిపెట్టాయి. రంగసాని మతి పోగొట్టాయి. అది మంచిదని ఏమిటిరుజువు? అసలు దెయ్యాలకి మంచీ చెడ్డా ఏమిటి? వాటికి మనుషులంతా శత్రువులే.

అయితే దెయ్యాలంటే భయం ఊళ్లో అందరికీ ఉందిగాని, దాని ఉధృతం తగ్గింది. కొందరు రైతులు రాత్రిపూటైనా సరే ఏటవతల పొలాలకి దెయ్యాల గరువు అడ్డంతొక్కి పోతున్నారు. పంచదార ఫాక్టరీ రాక క్రితం పడమటి వీధినించి చుట్టు తిరిగి పోయేవారు.

రంగప్రసాదరావుగారు చైర్మన్ అయిన కొద్ది రోజులికి, ఆయనను, అసలు దెయ్యాలు లేవేమోనన్న అనుమానం, దెయ్యాల గరువు అనవసరంగా నిష్ప్రయోజనంగా పడి ఉందన్న బాధ, దాని వైశాల్యం చూసి ఆశ పీడించడం మొదలు పెట్టాయి.

ఇంచుమించు అదే సమయానికి పాతకాంగ్రెసు తరపున నిలబడి జిల్లా పరషత్తు చేర్మెన్ అయిన వెంకన్న చౌదరిగారినీ సరిగా ఈఅనుమానం, బాధ, ఆశ పీడించసాగాయి.

అప్పుడు ఇద్దరు పెద్దలూ, దెయ్యాల గరువుయొక్క హక్కుదారులను గురించి ఆరా తీయడం మొదలుపెట్టారు.

కరణం గవరయ్య ఎరికలో ఆ గరువుకి ఎవరూ పన్ను కట్టలేదు. అతని నాన్నగారి హయాంలో, మద్రాసులోనో, హైదరాబాదులోనో ఉంటున్న వీరారం జమీందార్ల వంశీయు దెవడో ఈ దెయ్యాల గరువు అమ్మడానికి

ప్రయత్నించినట్టు, దెయ్యాలకు జడిసి అది ఎవరూ కొనడానికి సాహసించ లేకపోయినట్టు, తనకు చూచాయగా గుర్తు ఉన్నాడు గవరయ్య.

కొన్ని సంవత్సరాలపాటు పన్ను కట్టకపోతే అది గవర్నమెంటు సొత్తయిపోతుందని కరణం, రంగప్రసాదరావుగారూ తీర్మానించుకున్నారు. అందువల్ల గవర్నమెంటు తరపున మునిసిపాలిటీ తన ఇష్టం వచ్చిన విధంగా ఆ స్థలాన్ని వినియోగపరచ వచ్చునని నిర్ణయించుకున్నారు.

అయితే పాత కాంగ్రెసు నాయకుడైన వెంకన్న చౌదరిగారికి ప్రత్యేక ఆస్థులు పవిత్రమైనవి. అందువల్ల వారు వీరారం జమీందార్ల సంతతి వారి కోసం మద్రాసు, హైదరాబాదు పట్టణాలు గాలించి, తుదకు బెంగుళూరు గుర్రపు పందాల్లో ఒక యువకుణ్ణి, కొత్త భూమికీ స్వర్గానికీ మధ్య ఉన్న స్థితిలో పట్టుకున్నారు. అతనిచేత పూజారి చలమయ్య పేర వ్రాయించిన ఒక ట్రాన్స్ఫరు దస్తావేజుమీద సంతకం పెట్టించి, ప్రతిఫలంగా అయిదువంద లిచ్చారు. వీరారం జమీందారువారి వారసుడికి ఆ సమయంలో అయిదు వందలు అయిదు లక్షలుగా కనిపించిన కారణంచేతా, అసలు ఫలానా ఊళ్ళో అయిదెకరాల గరువు ఇన్ని తరాలుగా తన పూర్వీకులు అమ్మకండా ఎందుకు ఊరుకున్నారో, ఎలా ఉండగలిగారో, అతనికి అర్థం కాకపోవడంవల్లా, చౌదరిగారు చూపించిన చోటల్లా సంతకాలు పెట్టి, అయిదువందలూ పుచ్చుకుని, ఆనాడు పందాలలో పోయిన ఆరువేలూ తిరిగి సంపాదించే కార్యక్రమంలో నిమగ్నుడైపోయాడు. ఎందుకైనా మంచిదని, చౌదరిగారి పూజారి చలమయ్యకి మరొక అయిదువంద లిచ్చి, ఆ అయిదెకరాల దెయ్యాల గరువు స్వాధీనపు తణఖా రాయించుకున్నారు.

ఈ ప్రయత్నాలలో హైదరాబాదు, మద్రాసు, బెంగుళూర్లు తిరగ డానికి చౌదరిగారికీ, చలమయ్యకీ నెలా పదిరోజులు పట్టింది. స్వగ్రామానికి వారు తిరిగివచ్చి, సదరు దెయ్యాల గరువు స్వాధీనం చేసుకోవడానికి వెళ్ళే

సరికి, ఒక బుల్‌డోజరు సదరు గరువు చదును చేస్తోంది. ఏటిలోంచి పైపులు వేస్తున్నారు. ఏటి గట్టు నానుకుని ఒక షెడ్డు, అందులో ఒక పంపు సెట్టు వెలిశాయి. చౌదరిగారూ చలమయ్యా, బిత్తరపోయారు. ఈలోగా జరిగింది ఏమంటే —

కరణం గవరయ్య పినతండ్రి, వెనక క్విట్ ఇండియాలోనో, అంత క్రితం ఏదో ఉద్యమంలోనో ఒక మూడు నెల్లు జైలుకి వెళ్ళి, నిస్సంతుగా చచ్చిపోయారు. ఆయన రాజకీయ బాధితుడు గనక, ఆయన వితంతు భార్య చేత దరఖాస్తు పెట్టించి, మునిసిపాలిటీచేత దెయ్యాల గరువు ఆమెకు దఖలు పరిచారు మునిసిపల్ చేర్మెన్ రావుగారు. ఆ తరవాత, ఆమెచేత క్రయ దస్తావేజు కొడుకుపేర వ్రాయించుకుని, కరణం గవరయ్యకి వెయ్యిరూపాయిలిచ్చారు. ఇప్పుడది కొత్తరకం జపాను పద్ధతి వ్యవసాయ కేంద్రంగా మార్చడానికి ప్రయత్నం సాగిస్తున్నారు.

చౌదరిగారు మొదట దావా వేద్దామనుకున్నారు గాని, పంట వచ్చిన తరవాత అది స్వాధీనం చేసుకుంటే ఉభయతారకంగా ఉంటుందని సలహా ఇచ్చాడు పూజారి చలమయ్య. చౌదరిగారికి ఆ సలహా నచ్చింది.

చౌదరిగారు దెయ్యాల గరువు విషయమై ఒక దస్తావేజు పుట్టించాడన్న సంగతి రంగ ప్రసాదరావు గారికి తెలిసింది. ఆయన ఊళ్ళోకి తిరిగొచ్చి రెండునెల్లయినా, తనకి ఏ దావా నోటీసూ రాకపోయేసరికి, రావుగారికి కొత్త అనుమానం కలిగింది. చౌదరిగారు పెద్ద దుర్మార్గమేదో తలపెడుతున్నాడని తను విన్నట్టు కరణం గవరయ్య చెప్పనే చెప్పాడు. అంచేత, రుద్రయ్యనీ, మునిగాణ్ణీ ఆ నాలుగు గోడల 'ఇంటి'లో నుంచి వెళ్ళగొడదామనుకున్న రావుగారు ప్లాన్ మార్చుకున్నారు. ఓ రోజు సాయంత్రం స్వయంగా వెళ్ళి చనువుగా పలకరించాడు వాళ్ళని.

"ఒరేయి రుద్రయ్యా, మునిగా! మీరిద్దరూ మీ పాకలోనే ఉండొచ్చు,"
అన్నారు.

"ఉన్నాంగదా అని," అన్నాడు రుద్రయ్య.

"ఎవరొచ్చి వెళ్ళిపొమ్మన్నా మీరు మాత్రం ఆ పాక ఖాళీ చెయ్యొద్దు."

"సత్తే సెయంగదా అని," అన్నాడు మునిగాడు.

"చేను పంట మీదుంది. దొంగ ముండా కొడుకు లెవరన్నా వచ్చి కోసుకుపోగలరు. జాగర్తగా చూస్తుండండి," అన్నారు రావుగారు.

"బొమిక లెగరెయ్యనా అని," అన్నారు ఇద్దరూ.

రావుగారు ఇద్దరికీ ఒక ఇరవై రూపాయి లిచ్చి వెళ్ళిపోయారు. రుద్రయ్య, మునిగాడు ఆ రాత్రి ఖర్చుకి ఎక్కడన్నా దొంగతనం చెయ్యాలను కుంటున్నారు. ఈ సొమ్ము చేతికి రావడంతోటే ఆ ప్రయత్నం విరమించు కున్నారు. కాపు సారా, వేపుడు మాంసం తెచ్చుకున్నారు. రంగసాని వ్యవహారం తరవాత ఆడ పిల్లలమీద వాళ్ళకి మోజు తగ్గింది.

రాత్రి రెండు గంటలవేళ వాళ్ళిద్దరూ ఏదో స్వర్గంలో ఉండగా, ఒక పదిమంది ఎవరో చేలో ప్రవేశిస్తున్న అలికిడైంది. ఇద్దరూ రావుగారు సప్లయి చేసిన బాణా కర్రలు పుచ్చుకుని చేను వేపు వచ్చారు. వచ్చిన పది మందీ కాస్త తమాయించారు.

కొంతసేపు ఇరు పక్షాలూ ఏమీ మాట్లాడలేదు. ఆఖరికి వచ్చిన పది మందికీ నాయకుడైన ఆసామీ ముందుకు వచ్చాడు. రుద్రయ్యనీ, మునిగాణ్ణి ఉద్దేశించి అన్నాడు:

"మేం పీడిత ప్రజల ప్రతినిధులం."

"లాండ్ గ్రాబ్ ఉద్యమం సాగిస్తున్నాం" అన్నాడు అతని అనుచరు డొకడు.

"మీకోసమే, అంటే మీలాంటి నిరాస్తి ప్రజలకోసం," అన్నాడు నాయకుడు.

"అంటే ?" అన్నాడు రుద్రయ్య' మునిగాడు ఆ భాష అర్థం కాక.

ఒక అరగంట తమ సిద్ధాంతాలను గురించి విశదీకరించాడు నాయకుడు. బంజరు భూములు ఆస్తిలేని వాళ్ళకి దఖలు పరచాలని ప్రభుత్వం ఏనాడో నిర్ణయించింది. అయితే అధికారంలో ఉన్న స్వార్థపరులైన పెద్దలు దాన్ని తోసిపుచ్చి, బంజరు భూములన్నీ సొంతం చేసుకుంటున్నారు. ఈ భూమి పాతికేళ్ళుగా బంజరుగా వుంది - ప్రభుత్వం బంజరుగా. ఉంది. అన్యాయంగా మునిసిపల్ చేర్మన్ దాన్ని సొంతం చేసుకుని సాగు చేయిస్తున్నాడు. ఆ పంట కోసుకోడానికి అతనికి హక్కులేదు. ఆ హక్కు రుద్రయ్య, మునిగాళ్ళవంటి నిరాస్తి పరులది.

రుద్రయ్యకీ, మునిగాడికీ ఇది నచ్చింది.

"క్రోసేస్తే పోలా," అన్నాడు మునిగాడు.

విప్లవ వీరులతో కలిసి, రుద్రయ్య, మునిగాడు కోత ప్రారంభించారు.

ఈ లోగా నిద్రపోతున్న రంగప్రసాదరావు గారిని కరణం గవరయ్య లేపి, అవతల మహా దారుణం జరిగి పోతోందని చెప్పాడు. పూజారి చలమయ్య అదే విధంగా చౌదరి గారిని లేపి హెచ్చరించాడు.

ఇద్దరు మహా నాయకులూ చెరొక ఏభై మందినీ కొడవళ్ళతో తీసుకుని బయలుదేరారు.

మూడు పక్షాల మధ్య మహా సంగ్రామం జరిగింది.

నలుగురు మరణించారు. ఇరవై మందికి ప్రమాదమైన గాయాలు తగిలాయి. పోలీసు బందోబస్తు వచ్చేసరికి సంగ్రామం చల్లబడిపోయింది. తమ కేమీ తెలియనట్టు రుద్రయ్య, మునిగాడు తమ ఇంట్లోకి జారిపోయి నిద్ర నటించారు.

లాండ్‌గ్రాబ్ ఉద్యమంలో పాల్గొన్న నేరానికి తొమ్మండుగురిని అరస్టు చేశారు పోలీసులు. పదవ ఆసామీ చనిపోయాడు.

మర్నాడు రాత్రి కోసిన పనలు కష్టపడి దులిపి, కాపలా ఉన్న పోలీసుల కన్నుగప్పి, ఏటవతల రైసుమిల్లు ఆసామీకి నాలుగు బస్తా లమ్మేశారు రుద్రయ్య, మునిగాడు.

వాళ్ళ జీవితంలో నిజమైన కష్టార్జితం అదే.

దెయ్యాల గరువు ఎవరిది అన్న విషయమై కోర్టులో విచారణ జరుగుతోంది. అది ఎన్నేళ్ళకు తేలుతుందో ఏమో. ప్రస్తుతం అది అఫీషల్ రిసీవర్ చేతిలో ఉంది. ఆయన అంత ముఖ్యమైన స్థలం నిరుపయోగంగా ఉండడం మంచిది కాదని, సేట్ శాంతారామ్‌కి కోర్టు తరఫున కవులు కిచ్చాడు. పంచదార ఫాక్టరీ అందులో చెరకుతోట వేసింది.

ప్రస్తుతం రుద్రయ్య, మునిగాడూ తమ ఇంట్లోనే ఉంటూ చెరకు తోటకి కాపలా కాస్తున్నారు.

(యువ, దీపావళి 1970)